మాయ!

మోసం చేసింది.!

అవును...తిరిగి జీవితంలో కోలుకోనంతగా!

అందరినీ నవ్విస్తూ జలపాతంలా సాగే మాయ!

చివరకు నమ్మిన నన్నే వంచించింది.!

కలలా వచ్చింది...!

రంగుల కలలు చూపించింది....!

మాయమైపోయింది.

ఇంతకు మాయ ఎవరంటారా?

నా క్లాస్‌మేట్.

అందానికి నిర్వచనం మాయ!

ఇంతకు నా పేరు చెప్పలేదు కదూ!

నా పేరు శశాంక్.

చదువుకునే రోజుల్లో ఎన్నో పరిచయాలు, స్నేహాలు ఉన్నప్పటికీ,

మాయతో చేసిన స్నేహం మరువలేనిది.

ఒక్క ఏడాది స్నేహంలోనే జీవితంలో మర్చిపోలేని ముద్ర వేసిన మాయ!

ఊహించని విధంగా మోసగించింది.

ప్రణయానికి, ప్రళయానికి తేడా లేదని తేల్చి చెప్పింది!.

మాయా..నేను టీచర్ ట్రైనింగ్‌లో సహాధ్యాయులం.

కాలేజీలో తొలి రోజే పరిచయమైన మాయ....

ఆపై నా హృదయ నేస్తంగా మారింది.

ఫలితంగా ఎన్నో ఊసులు...రంగుల కలలు...!!

ఆమె తోడిదే జీవితంగా అనుకున్న నాకు ఒక రోజు ఊహించని షాక్ ఇచ్చింది.

మాయ వచ్చి రాగానే 'హాయ్! డల్‌గా ఉన్నావేమిటీ?

డల్‌గా ఏమీ లేనే?

నెనొకటి చెబుతా నిదానంగా వింటావా?!

చెప్పు!

చెప్పాక, అధైర్యపడొద్దు అంది!

ముందు చెప్పు!

నన్ను మర్చిపో?!

ఆశ్చర్యమేసింది...!? నిర్ఘాంత పోయాను...!

''వ్వాట్?'' నువ్వు మాట్లాడేదేమిటి?

అవును..నువ్వు విన్నది నిజమే!

నన్ను మర్చిపో! నిజంగా నేనంటే నీకు ప్రేముంటే!...నేను బాగుండాలంటే...!

నా గురించి మర్చిపో!...నేను ఎక్కడున్నానో? ఏం చేస్తున్నానో? ఆరా తీయకు! అంతే ఇంతకంటే ఏమీ చెప్పలేను. అంటూ ఊపిరి సలపనీయకుండా చెప్పింది.

నిజమే మాయ!....నువ్వు చెప్పిందాంట్లో నీ స్వార్థం ఉందనుకోను. కానీ కారణం చెప్పు!

చెప్పలేక చెప్పింది మాయ...తనకు పెళ్ళికుదిరిందని! తన గురించి ఆలోచించవద్దని!

నిజమే! మర్చిపోతాను...! కానీ నీ గురించి ఆలోచించకుండా ఉండలేను.

అదే వద్దు! నువ్వు సుఖంగా ఉండాలి. నువ్వు కూడా నీకు నచ్చిన వారిని పెళ్ళి చేసుకో.!

చెప్పడమే కాదు! ప్రమాణం చేయించుకొని, వెళ్ళిపోయింది!

నాకు కన్నీళ్ళు ఆగ లేదు. నదీ ప్రవాహంలా కారాయి.!

కానీ! మాయను నిజంగా కోరుకున్న నేను... మాయ ఎక్కడున్నా సుఖంగా ఉండాలనుకున్నాను.

మాయ పెద్దింటి ఆడపిల్ల, మరి నేనో! దరిద్రం తాండవిస్తున్న పేదవాణ్ణి!

మాయను చేసుకొని సుఖ పెట్టగలనా? లేదు! అందుకే మాయను మర్చిపోవాలనుకున్నా!

మర్చిపోయాను...! కాదు ఆమె ఎక్కడుందో ఆరా మాత్రమే తీయలేదు.

ఇది జరిగిన కొన్ని రోజులకే మాయ గురించి తెలిసింది...

మాయ! మాయ! ఎంత పని చేసింది?!

నిజమే ఆ స్వచ్ఛమైన మనస్సు, స్వచ్ఛమైన నవ్వు ఇక నాకు కనిపించవు.

ఇంతకూ మాయ ఎక్కడుందను కుంటున్నారు!

కావాలనుకున్న వాణ్ణి అందుకోలేక,

పెద్దవాళ్ళ పంతాలు, పట్టింపులతో కట్టుకున్నవాడిని మోసం చేయలేక

మాయ వెళ్ళిపోయింది... అనంత తీరాలకు... అందనంత ఎత్తుకు!

ఒక్క క్షణం!!

నేను తెగించినా!

మాయ పెద్దలను ఎదిరించినా...!

ఆ స్వచ్ఛమైన నవ్వు నాకు శాశ్వతంగా దక్కేమో!?

అందుకే ఏమీ చెప్పలేక, చెప్పినా వింటానో! వినవో? ధైర్యం చేస్తానో..చేయనో! అనుకుందేమో!

ఏమీ చెప్పకుండానే! తిరిగి రాని లోకాలకు పయనం కట్టింది.!

ప్చ్...నిజమే! ప్రేమకు త్యాగం ఎంత అవసరమో!

తెగింపు కూడా అవసరమే!?

లేకుంటే...??

జీవితం అడవి కాసిన వెన్నెలే?!

కాదంటారా...?

– చల్లా కరుణాకర్‌రెడ్డి